# ఉరిశిక్ష అమలు సమంజసమేనా?

జనరల్ స్టడీస్

ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

## ఉరిశిక్ష

అఫ్జల్‌గురుకు విధించిన ఉరిశిక్షను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ తీవ్రవాద సంస్థలు దేశ రాజధానిలో మరోసారి దాడులకు పాల్పడ్డాయి. మరోవైపు రాజీవ్‌గాంధీ హత్యకేసులో నిందితులకు విధించిన ఉరిశిక్ష ఉదంతం కూడా వార్తల్లోకి వచ్చింది. దీంతో ఉరిశిక్ష విధించడం న్యాయమా? కాదా? అన్న చర్చ మొదలైంది. ఉరిశిక్షను రద్దు చేయాలని కొందరు, ఉండాల్సిందేనని మరి కొందరు బలమైన వాదనలను వినిపిస్తున్నారు.

ఉరిశిక్షను ఖరారుచేసిన తర్వాత కూడా దీర్ఘకాలంపాటు అమలు చేయకపోవడం ఈ చర్చలకు కారణమవుతోంది. ఈ అంశంపై ప్రపంచవ్యాప్తంగా భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు రాజీవ్ గాంధీ హత్యకేసు నిందితుల క్షమాభిక్షను తిరస్కరించడానికి రాష్ట్రపతికి 11 ఏళ్లు పట్టింది. ఇప్పుడు దీని అమలుపై మద్రాసు హైకోర్టు స్టే విధించింది. 1998లో రాజీవ్ గాంధీ హత్య కేసులో మొత్తం 26 మంది నిందితులకు ప్రత్యేక ట్రయల్ కోర్టు ఉరిశిక్షను విధించింది. అయితే సుప్రీంకోర్టు మాత్రం వారిలో నలుగురికే ఉరిశిక్షను ఖరారు చేసింది. 2000లో నళినికి విధించిన ఉరిశిక్షను కూడా జీవిత ఖైదుగా మార్చారు. ఇక మిగిలిన ముగ్గురి ఉరిశిక్షకు సంబంధించిన క్షమాభిక్ష పిటీషన్ పెండింగ్‌లో ఉంది. పదకొండేళ్ల తర్వాత ఈ క్షమాభిక్ష పిటీషన్‌ను రాష్ట్రపతి తిరస్కరించారు. ఈ నిర్ణయం తమిళనాడులో రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. క్షమాభిక్ష డిమాండ్ రాజకీయ సమస్యగా మారింది. చివరకు తమిళనాడు అసెంబ్లీ కూడా ఈ క్షమాభిక్ష పిటీషన్‌ను పునఃపరిశీలించాలంటూ రాష్ట్రపతిని కోరుతూ తీర్మానం చేసింది. ఉరిశిక్షను జీవితఖైదుగా మార్చాలని కోరుతూ తమిళనాడు శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. అయితే ఈ తీర్మానం చేసిన పార్టీలన్నీ గత పదేళ్లలో ఎప్పుడో ఒకసారి కేంద్రంలో అధికారాన్ని అనుభవించినవే. కేవలం రాజకీయ లబ్ధి కోసమే అప్పుడు మౌనంగా ఉన్న పార్టీలన్నీ ప్రస్తుతం ఈ ప్రతిపాదనను ముందుకు తెస్తున్నాయి. అయితే తమిళనాడు శాసనసభ చేసిన తీర్మానం పై రాష్ట్రపతి సానుకూలంగా స్పందిస్తే, అఫ్జల్‌గురుకు కూడా క్షమాభిక్ష పెట్టాలంటూ జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ కూడా తీర్మానాన్ని చేసే అవకాశం ఉంది. అప్పుడు రాష్ట్రపతి ఏ విధంగా స్పందిస్తారు? 2001లో పార్లమెంట్‌పై దాడి చేసిన సంఘటనలో అఫ్జల్‌గురు నిందితుడు. ఈ కేసులోనూ క్షమాభిక్ష పిటీషన్ రాష్ట్రపతి ముందుంది. దీన్ని తిరస్కరించాలని కేంద్ర హోం శాఖ సిఫారసు చేసింది. తమిళనాడు శాసనసభ మాదిరిగానే జమ్మూకాశ్మీర్ శాసనసభ కూడా అఫ్జల్ గురు విషయంలో తీర్మానం చేస్తే ఆమోదిస్తారా అంటూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రశ్నిస్తున్నారు.

### రాజకీయ లబ్ధే ప్రధానం

క్షమాభిక్ష పిటీషన్లపై రాష్ట్రపతి తన సొంత విచక్షణను ఉపయోగించి నిర్ణయాలను తీసుకునే వీలు భారత రాజ్యాంగం కల్పించింది. కానీ, తమిళనాడులో ప్రస్తుతం వివాదంగా మారిన రాజీవ్ హత్య కేసు నిందితుల క్షమాభిక్ష పిటీషన్‌కు సంబంధించి కేంద్ర హోం శాఖ సిఫారసును రాష్ట్రపతి ఆమోదించారు. అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే ఉరిశిక్ష విధించాలని గతంలో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అయితే న్యాయ వ్యవస్థ ఖరారుచేసిన ఉరిశిక్షలను అమలుచేసేందుకు అధికార పార్టీ తటపటాయిస్తోంది. దీనికి కారణం ఉరిశిక్ష ఉచితానుచితాలపై ధర్మమీమాంస కాదు, కేవలం రాజకీయ లబ్ధి కోసం మాత్రమే.

ప్రపంచవ్యాప్తంగా ఉరిశిక్షను రద్దు చేయడమో లేదా దీని అమలుకు మారటోరియాన్ని విధించే దిశగా ప్రపంచదేశాలు పయనిస్తున్నాయి. అయితే మనదేశంలో మాత్రం ఇప్పటికీ ఉరిశిక్షను రాజ్యాంగం ఆమోదిస్తోంది. దేశంలో ఉరిశిక్షకు అనుకూలంగా ఉన్న ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు ఈ శిక్షను రద్దు చేసేందుకు వెనుకాడుతున్నాయని 'ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' సంపాదకీయంలో వ్యాఖ్యానించారు.

### ప్రాణం తీయడం న్యాయమా?

మన దేశంలో క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో తీవ్ర లోపాలున్నాయి. పోలీసు, న్యాయ వ్యవస్థల్లో తీవ్ర లోపాలున్నప్పుడు నేరం చేయనివారికి కూడా శిక్షలు పడే ప్రమాదముంది. వెనక్కు తీసుకునే వీలులేనిది ఉరిశిక్ష. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ అన్నమాటలను కూడా ఉరిశిక్షను వ్యతిరేకించేవారు ఉదాహరిస్తున్నారు. 'మనం నేరగాడిని కాదు, నేరాన్ని చంపాలి.' అనేది గాంధీ సూక్తుల్లోని సారాంశం. పుట్టుకతోనే ఎవరూ నేరగాళ్లు కారు. అలాగే శాశ్వత నేరగాళ్లూ ఉండరు. క్షణికావేశంలో కొన్ని సందర్భాల్లో నేరాలకు, మరికొన్నిసార్లు క్రూరమైన నేరాలకూ పాల్పడుతుంటారు. అందువల్ల నేరగాళ్లకూ మారేందుకు అవకాశం ఇవ్వాలన్నది వాదన. ఆధునిక నాగరిక సమాజంలో కూడా శిక్ష పేరుతో ప్రాణాలు తీయడం ఎంతవరకూ సమంజసం. చివరకు ఈ శిక్షను అమలు చేసేందుకు మనుషులు దొరకని పరిస్థితి. 'కన్నుకు కన్ను, పన్నుకు పన్ను' అన్నది ఆటవిక న్యాయం కాదా? ప్రజాస్వామిక దేశాలు ఈ ఆటవిక న్యాయాన్ని అమలు చేయడం న్యాయమా? అని ఉరిశిక్షను రద్దు చేయాలని వాదిస్తున్నవారు ప్రశ్నిస్తున్నారు. మన దేశంలో ఇంకా ఉరిశిక్షకు కొంతమేరకైనా సానుకూలత ఉండటానికి కారణాలు ఉన్నాయి. నేరగాళ్లకు సరిగా శిక్షలు పడకపోవడం, కేసుల విచారణ సుదీర్ఘకాలం జాప్యం కావడం వల్ల ప్రజల్లో నైరాశ్యం పెరుగుతోంది. దీని నుంచే కఠినమైన శిక్షలకు అనుకూలంగా ప్రజాభిప్రాయం వ్యక్తమవుతోంది. మన రాష్ట్రంలో యాసిడ్ దాడులకు పాల్పడిన వారు ఎన్‌కౌంటర్‌లో చనిపోతే ప్రజలు హర్షించారు. పోలీసులను ప్రజలు అభినందించిన ఉదాహరణను చూశాం. ఇలాంటి శిక్షలు పడినప్పుడే నేరగాళ్లు భయపడతారని ప్రజలు నమ్ముతున్నారు. కానీ వాస్తవాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఈ ఘటన తర్వాత కూడా యాసిడ్ దాడులు జరిగాయి. అంటే కఠినమైన చట్టాలు, శిక్షల వల్లే నేరాలు తగ్గుతాయనేది పొరపాటు.

### న్యాయం చేయడంలో ఆలస్యమూ అన్యాయమే!

పార్లమెంట్‌పై దాడి జరిగిన సమయంలో దేశంలో 'పోటా' లాంటి బలమైన చట్టం అమల్లో ఉంది. అయినా ఈ నేరాన్ని ఆపలేకపోయాం. అందువల్ల ఉరిశిక్ష రద్దుకు అనుకూలంగా ప్రజాభిప్రాయం ఏర్పడాలంటే మన నేర పరిశోధనా, న్యాయ వ్యవస్థలు సత్వర న్యాయాన్ని అందించే దిశగా చర్యలు చేపట్టాలి. వాస్తవానికి ఉరిశిక్ష కంటే కూడా కఠినమైంది యావజ్జీవ శిక్ష. ఉరిశిక్ష విధిస్తే ఒక్కక్షణంలో నేరగాడు చనిపోతాడు. జీవితఖైదీ క్షణక్షణం బాధపడతాడు. ప్రస్తుతం నొప్పి లేకుండా ఉరిశిక్షను అమలుచేయాలన్న ప్రతిపాదనలు వస్తున్నాయి. దీని కంటే బతికినంత కాలం తాను చేసిన నేరం గుర్తుకువచ్చే విధంగా శిక్ష ఉండటం మంచిది కాదా అనేది ఉరిశిక్షను వ్యతిరేకించేవారి వాదన. ఒకవేళ న్యాయస్థానాలు తీర్పు వెలువడే సమయానికి అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాలపై ఆధారపడి ఒక వ్యక్తిని నేరగాడిగా ప్రకటించవచ్చు. కానీ, తర్వాత లభించిన కొత్త సాక్ష్యాధారాల వల్ల ఆ వ్యక్తి నిర్దోషి అని తేలవచ్చు. అలాంటి పరిస్థితుల్లో పడింది మరణశిక్షే అయితే మార్చే అవకాశమే ఉండదు. తప్పుడు తీర్పులను సరిచేసే వీలుండదు. ప్రస్తుతం న్యాయవ్యవస్థ ముందున్న సమస్య ఎంత కఠినమైన శిక్షలను విధిస్తారా అన్నది కాదు. ఎంత త్వరగా నేర విచారణ పూర్తయి శిక్షలు విధిస్తారన్నది ముఖ్యం. అందులోనూ ఉరిశిక్ష లాంటి కఠినమైన శిక్షలను విధించాలంటే న్యాయమూర్తులు కూడా ఒకటికి పదిసార్లు ఆలోచించే అవకాశం ఉంది. దీనివల్ల మరింత జాప్యం కావచ్చు. నేరగాళ్లకు శిక్షలు పడటమన్నది కేవలం నేరాలపైనే ఆధారపడి ఉండదు. సాక్ష్యాధారాలు, అతడి తరపు న్యాయవాది సామర్థ్యం, న్యాయమూర్తి వచ్చిన నేపథ్యం మొదలైన అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో అసలు నేరగాళ్లు తప్పించుకోవచ్చు. నేరం చేయనివారికి శిక్షలు కూడా పడవచ్చు. శిక్షలు కఠినమవుతున్న కొద్దీ నేరగాళ్లు తప్పించుకునే అవకాశం పెరుగుతుంది. రాజకీయంగా, ఆర్థికంగా బలమైన నేపథ్యం ఉన్నవారికి తప్పించుకునేందుకు అనేక మార్గాలుంటాయి. కానీ, పేదవారికి మాత్రమే ఇలాంటి కఠినమైన శిక్షలు పడే అవకాశం ఉంది.




### నేరగాళ్లను ప్రజాధనంతో పోషించాలా?

ఉరిశిక్షను సమర్థించేవారు కూడా ఇదే విధమైన వాదనలను చేస్తున్నారు. ఘోరమైన నేరం చేసిన వారిని ప్రజల ధనంతో జీవితకాలం పోషించడమెందుకు? ఉరిశిక్షను చూసైనా నేరాలు చేయాలనుకునేవారు భయపడతారు. బాధితులకు ఈ శిక్షలు ఉపశమనాన్ని ఇస్తాయి. ఉరిశిక్ష లేకపోతే, బాధితుడు నిరంతరం భయంతో బతకాలి. ఎప్పుడు నేరగాడు విడుదలవుతాడో, ఎప్పుడు తమపై దాడి చేస్తాడోననే భయంతో జీవించాల్సి వస్తుంది. నేరం చేసిన వాడు నిర్భయంగా బతుకుతాడు. కానీ, బాధితుడు మాత్రం నిత్యం భయంతో జీవించాలి. ఇదెక్కడి న్యాయం? అని ఉరిశిక్షను సమర్థించేవారి వాదన. నేరం చేయాలనుకునే వారు కఠినమైన శిక్షలకు భయపడతారు. అదే సమయంలో ఘోరమైన నేరాలకు కూడా శిక్షలు పడకుంటే నేరగాళ్లు చెలరేగిపోతారు. చాలామంది నేరగాళ్లు ఏళ్ల తరబడి కఠినమైన శిక్షలు అనుభవిస్తూ జైళ్లలో ఉంటే, వారిలో పరివర్తన రాకపోగా, కసి పెరిగి మరింత కరడుగట్టిన నేరగాళ్లుగా మారే ప్రమాదం ఉంది.

### అరుదుగా విధించాలి

మధ్యేమార్గంగా వాదించేవారు కూడా ఉన్నారు. ఉరిశిక్షను పూర్తిగా చట్టం నుంచి తొలగించకుండా అరుదుగా మాత్రమే విధించాలనేది వీరి వాదన. అతి క్రూరమైన నేరాలకు పాల్పడిన సందర్భాల్లో, ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా నేరం రుజువైనప్పుడు మాత్రమే ఉరిశిక్షను విధించాలని వీరు వాదిస్తున్నారు. ఉరిశిక్షలు విధించేందుకు అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదాహరణకు ఎక్కువ మంది సభ్యులు ఉన్న బెంచ్‌లు మాత్రమే ఉరిశిక్షను ఖరారు చేయాలి. న్యాయమూర్తులు ఏకగ్రీవంగా ఆమోదిస్తేనే ఉరిశిక్ష విధించాలని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొంది. లా కమిషన్ లాంటి వ్యవస్థలు న్యాయపరమైన పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉరిశిక్ష అమలు అవుతున్న సమయంలో నేరగాడైనాసరే ఆ వ్యక్తి అనుభవించే శారీరక బాధను దృష్టిలో పెట్టుకోవాలని, మరణ శిక్షను అమలుచేసేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులను అమలుచేయాలని 2003లో లా కమిషన్ తన 187వ నివేదికలో తెలిపింది.

ధనుంజయ్ చటర్జీ కేసులో తీర్పు చెబుతూ జస్టిస్ జె.ఎస్. ఆనంద్, జస్టిస్ ఎన్.పి. సింగ్‌లతోకూడిన ఇద్దరు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొన్న మాటలు ఇక్కడ గమనార్హం. నేర తీవ్రత ఆధారంగానే శిక్ష తీవ్రత ఉంటుంది. నేరగాళ్లను శిక్షించమంటూ సమాజం నుంచి వ్యక్తమవుతున్న తీవ్ర ఆకాంక్షకు అనుగుణంగా న్యాయ వ్యవస్థ సరైన శిక్షను విధించాల్సి ఉంటుంది. నేరాలకు తగ్గట్టుగా శిక్షను విధించటం ద్వారా ఆ నేరం పట్ల ప్రజల ఆగ్రహానికి న్యాయం చేయాల్సి ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అన్న మాటలు కూడా ఇక్కడ గమనార్హం. ఉరి తీయకపోతే సమాజానికి అత్యంత ప్రమాదకరంగా తయారవుతాడని ముమ్మాటికీ నమ్మితే తప్ప దోషికి ఆ శిక్ష ఖరారు చేయలేం. ఉద్యమాలు, పత్రికలు, ప్రసార సాధనాలు తీర్పులను ప్రభావితం చేయలేవు. సామాజిక దృక్పథమే న్యాయమూర్తులను నడిపిస్తుంది. దోష నిర్ధరణకు, శిక్షకు తేడా ఉంది. శిక్ష విధింపులో సామాజిక ప్రయోజనమే అత్యంత ప్రధానమైన విషయం. మరణశిక్షే పరిష్కారం కాదు. దోషులు మారేందుకు అవకాశాన్నివ్వాలి. అత్యంత అసాధారణ కేసుల్లో మాత్రమే ఉరిశిక్షను విధించాలని సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో స్పష్టం చేసింది. ప్రయత్నిస్తే దోషులు మారేందుకు అవకాశం ఉందా అన్నది శిక్ష విధించేందుకు ప్రాతిపదిక అవుతుంది.

యావజ్జీవ ఖైదు అనుభవిస్తున్న ప్రతిక్షణం తాను కోల్పోతున్న జీవితం గురించి ఆలోచించడమే పెద్ద శిక్ష అవుతుంది. అందువల్ల ఉరిశిక్ష ఒక్కటే కఠినమైన శిక్ష అని అనుకోలేం. నేరగాడు బతికి ఉంటే బాధితులకు, సమాజానికి ఉండే ప్రమాదం ఏమిటి అన్నదానిపై ఆధారపడి శిక్షలుండాలి. ఏదేమైనా ఈ విషయంపై సమగ్రమైన చర్చ అవసరం. జాతీయ ఏకాభిప్రాయం సాధించే దిశగా మరింత కృషి చేయాల్సిన అవసరం ఉంది.

(రచయిత జర్నలిజం అధ్యాపకులు, కాలమిస్టు)